
# హరహర మహాదేవ



శరభ! శరభ!

దశ్శరభ! శరభ!

ఆదిశేషువు పడగలెత్తి

సంబరంబున బుసలు పెట్టా

నందికేశుడు రంకెవేసీ

ముదముతో మున్ముందు నడవా

వీరభద్రుడు భద్రమూర్తయి

రుద్రగణముల తోడు నిలువా

డమరుకల ప్రళయార్భటులు

భూమండలము నిండా ఫెళ్ళుమనగా

హరా! కదలిరావయ్యా!

అమ్మతో కలగలసి రావయ్యా!

అమరేశ్వరా! తరలిరా తండ్రీ! మహాశివరాత్రినాడు వేంకటాద్రి నాయుడి మంటపంలో నిన్న పార్వతీదేవిని చేపట్టిన తండ్రీ! నేడు రథోత్సవానికి బయల్వెడలవయ్యా! చండీశ్వర భృంగీశ్వర సకల కైలాసగణంతో కైలాసం నుండి కదలిరా తండ్రీ!

కోటగుమ్మానికెదురుగా పెద్ద రథం సిద్ధంగా వుంది. రథానికి కట్టిన రంగురంగుల గుడ్డలు గాలిలో తేలిపోతున్నాయి. రథకేతనం శివరాత్రి గాలిలో అమరావతి ఆకాశాన రెపరెప లాడుతోంది.

పెద్ద బజారు నిండా ఇసుకవేస్తే రాలని జనం. సందుల్లో జనం. గొందుల్లో జనం. బజార్లలో జనం. గుళ్ళో జనం. గోపురాల్లో జనం. మంటపాల్లో జనం. కృష్ణ రేవంతా జనం. కృష్ణలోని పడవల నిండా జనం. అవతల వొడ్డున ఇసుక తిన్నెల నిండా జనం. రథోత్సవాన్ని తిలకించటానికి పరుగు పరుగున వస్తున్న మహాజనం. వీధులన్నీ నిండిపోయాయి. ఇళ్ళు నిండిపోయాయి. ఇళ్ళ కప్పులు నిండిపోయాయి. చెట్లు నిండిపోయాయి. భక్తజన సాగరం అమరావతిలో పరుచుకున్నట్లుంది. రంగురంగు తల పాగాలు, సైకిల్ కట్టుపంచెలు, కోరమీసాలు, వారచూపులు, జులపాల జుత్తులు, పేటేరు చీరలు, బుట్టజాకెట్లు, క్రీగంటి సౌంజ్ఞలు, పైట సర్దుళ్ళలో, పాపిట దిద్దుళ్ళలో, నగలు భద్రం పేరిట పాలిండ్లు హత్తుకోటంలో బోలెడు సంకేతాలు .... కావాలని బుజం రాచుకున్న సోగ్గాళ్ళవైపు కన్నె పిల్లలు చురుక్కున చూసి 'నీ జిమ్మడ' అని నవ్వుతూ తిట్టి ముందుకు పరుగెట్టడాలు, తప్పిపోయి ఏడుస్తున్న పిల్లలు, గాభరాగా వాళ్ళ నెతుక్కుంటున్న తల్లిదండ్రులు- ఇలా కోలాహలంగా ఉంది.

పదామడ దూరంనించి పరుగు పరుగున వచ్చారు జనం. పల్లెపడుచులు బారులు తీరివున్న గాజుల కొట్లలో బేరమాడుతుంటే మొగవాళ్లు చెరుగ్గడలు కొనుక్కుంటున్నారు. పిల్లలకి బెల్లం మిఠాయి తినిపిస్తున్నారు. ఒక పక్క "కలభ సుందరా గామానా .... కిట తయ్యకు తద్ధిమిత ...... తక తక తక.... కలభ ... " అంటూ చెక్క భజన జోరుగా సాగుతోంది. ప్రతివూరు నుంచి ఓ చెక్క భజన

బృందం వచ్చి బజారంతా భజనలు చేస్తున్నారు. ఓ పక్క సన్నాయి, మరో పక్క బాండు మోగుతుంటే ఇంకోపక్క మొండిబండ వాళ్ళు జు:య్! జు:య్ జు:య్న్ని రుంజ మోగిస్తూ ఛెడేల్! ఛెడేల్‌మని కొరడాలతో బాదుకుంటూ నెత్తురు కక్కుతున్నారు. ఇంకో పక్క "కాయ్‌రాజా కాయ్! ఒంటె, గుఱ్ఱం ఖాళీ" ఆట సాగుతుంటే ఆట మజాలో ఉన్నవాళ్ళ జేబుల్లో చేతులెట్టినందుకు కొందర్ని పోలీసులు తీసుకెళ్తున్నారు.

హర హర మహాదేవ! జనం కేక.

ఆ కేక జనమంతా అందుకున్నారు 'హర హర మహాదేవ!'

అమరావతి ఊరంతా మార్మోగింది. వేలాది జనం నిక్కించి దేవాలయం వైపు చూస్తున్నారు.

అడుగో స్వామి బయలుదేరుతున్నాడు. స్వామి విగ్రహాలు దేవాలయం నుంచి రథంవైపు కొస్తున్నాయి. ముందుగా అమరేశ్వరస్వామి, ఆ తర్వాత బాల చాముండేశ్వరి, ఆపైన మహిషాసురమర్ధని, ఆ వెనక ఉత్సవ విగ్రహాలు, ఆ తర్వాత మరో దేవి విగ్రహం, ఆమె జ్వాలాముఖా? ఎవరాదేవి? గంగమ్మా? నెత్తినున్న తల్లిని పక్కన కూర్చోపెట్టుకున్నావా తండ్రీ? కాదయ్యా! కృష్ణలో కొట్టుకొచ్చి ఇసుకలో కూరుకుపోతే దొరికిందయ్యా ఆ దేవి విగ్రహం. అయితే కృష్ణమ్మా? కృష్ణమ్మో, గంగమ్మో ఎవరైనా ఆ చాముండేశ్వరీదేవే కదుటయ్యా, మరంతే.

హరహర మహాదేవ!

విగ్రహాలన్నీ చిన్నరథం మీదకొచ్చాయి. చిన్న రథంమీంచి ఒక్కొక్క విగ్రహాన్నే పెద్దరథం మీదికెక్కిస్తున్నారు. శంఖాలు పూరిస్తున్నారు. జేగంటలు మోగుతున్నాయి. సన్నాయి ఉచ్చైస్స్వరంతో గాలిలో ఆడుతోంది. 'శంభోశంకర! సాంబ సదాశివ!' భజనలు చెవుల్లో గింగురు మంటున్నాయి. అలాంటి సమయాన స్వామి తన పరివారంతో రథమెక్కాడయ్యా! రథం చుట్టూ మంత్రాలతో ఎఱ్ఱ అన్నం బలిహరణ వేశారు. మషాల్తీలు కాగడాలతో స్వామి రథం ముందు

కూర్చున్నారు. రథం లాగటానికి రెండు పక్కలా మోకులు పట్టుకొని సిద్ధంగా ఉన్నారు జనం. పెద్ద దొరగారి హారతి అవటంతోనే జంగం సవరయ్య "హర హర మహాదేవ" అంటూ జండా వూపటమేమీ రథం కదిలిందయ్యా! కైలాస రథం కదిలిందయ్యా! జనం గుండెలు పొంగగా స్వామి తేరుమీద తేలిపోతూ ముందుకు నడిచాడయ్యా! జనం రథం మీద పూలు విసిరారు, పత్రి విసిరారు, అరటిపళ్ళు విసిరారు, జాంపళ్ళు విసిరారు. ఆ విసిరిన జాంకాయ మషాల్తీ నరసింహం తలకు ఠంగున తగిలేసరికి అతనికి దిమ్మర పోయింది. పరుగు పరుగున వెళ్తున్న స్వామి రథం మధ్యలో ఆగిపోయింది.

రథం ఆగిపోయింది!

అంగుళం కదలటంలేదు. అందరూ పట్టి లాగారు. కదల్లేదు. రథాన్ని పరీక్ష చేశారు. లాభంలేదు. గొంతెత్తి స్వామిని కీర్తించారు. రథం కదల్లేదు.

మూడు రోజులు కాలినడకన ప్రయాణం చేసి మోగులూరి నించి వచ్చిన ముసలమ్మ దార్లవారి వరండాలో దీపారాధన చేసుకొని స్వామి రాకకోసం ఎదురు చూస్తోంది. ముక్కోటి ముసలమ్మకి ముద్దుల చెల్లెలు ఈ మోగులూరు ముసలమ్మ. స్వామిని చూద్దామంటే జనం ముందుకు పోనివ్వరు. రథం ఆగటంతో జనం ఆగారు. ఆ సమయాన చేత దీపారాధనతో మనుషుల్ని వొత్తిగించుకుంటూ రథం ముందుకు పచ్చింది. "పో ముసలమ్మా" అని ఎవరో అంటే "పోవటానికే వచ్చాను తండ్రీ" అంటూ దీపారాధన చూసుకుంది. స్వామిని చూసింది. నవ్వుతున్న స్వామి పక్క సిగ్గుపడుతున్న అమ్మని చూసింది. మళ్ళీ దీపాన్ని చూసుకుంది. నవ్వుకుంది. ఏడ్చుకుంది. ఇంతలో ఎవరో "హర హర మహాదేవ!" అన్నారు - మోకులెత్తుకున్నారు. జనం "హరహర" అంటూ రథం లాగారు. చక్రాల సందులోకి వెళ్ళిపోయింది మోగులూరు ముసలమ్మ. చక్రాల కింద నలిగిపోయింది ముసలమ్మనుకున్నారు.

లేదు. రథం కిందినుంచీ ఇవతలకొచ్చి నుంచుంది. ఠీవిగా నుంచుంది. కళకళ లాడుతూ నుంచుంది. చేతిలో వెలుగుతున్న దీపాన్ని చూసింది. ఉరకలేస్తూ పరుగు తీస్తున్న స్వామి రథాన్ని చూసింది. గలగలా నవ్వుతూ ఏడ్చింది. *